
శిల్పారామం..చిత్రాలెన్నో

గ్రామీణ వాతావరణాన్ని తలపిస్తున్న వైనం ● అలరిస్తున్న సాంస్కృతిక కార్యక్రమాలు



శిల్పారామం మరింత శోభాయమానంగా మారింది. పల్లెటూరి వాతావరణంతో అలరారుతోంది. దేశవ్యాప్తంగా వివిధ ప్రాంతాల కళాకృతులు, నృత్య రీతులు, సంస్కృతి సాంప్రదాయాలను తెలిపే చిత్రాలు సందర్శకులను ఆకట్టుకుంటున్నాయి. అలాగే వెదురు బొంగులతో, గంట ఆకృతితో నిర్మించిన ఆర్చ్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ఇక ప్రత్యేకంగా పూలమొక్కలు, పచ్చిక బయళ్ల నడుమ బృందావనం పార్కులో శ్రీకృష్ణుడి జననం నుంచి నిర్యాణం, శ్రీకృష్ణ సత్యభామ విగ్రహాలు, గోపికల చీరలను దొంగిలించిన ఘట్టాలను అద్భుతంగా తయారు చేశారు ఆర్టిస్ట్ శంకర్, శ్రీకృష్ణుడి లీలలతో సహా అన్ని సన్నివేశాలను తెలిపే ప్రదర్శన ఏర్పాటు చేశారు. శిల్పారామంలో తరచూ టీవీ సీరియళ్ల షూటింగ్‌లు జరుగుతున్నాయి. ఇక వారాంతపు కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శనలు జరుగుతున్నాయి. పండగలు, ప్రత్యేక దినాల్లో పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు.

– మాదాపూర్‌



గైడ్‌ ఉంటే బాగుంటుంది



మొదటిసారి శిల్పారామం వచ్చాను. చిత్రాలు అద్భుతంగా ఉన్నాయి. భాష సమస్యతో ఇబ్బందులు వస్తున్నాయి. చిత్రాలు, విగ్రహాల వద్ద వాటి ప్రత్యేకతను తెలిపే విధంగా ఒక గైడ్‌ను ఏర్పాటు చేస్తే బాగుంటుంది. విలేజ్‌ మ్యూజియం, తోలుబొమ్మలాట, హస్తకళా ఉత్పత్తుల ప్రదర్శన, కోనసీమ తదితరాల ప్రత్యేకతలను తెలుసుకోవాలి.

– గాయత్రి, విద్యార్థిని













కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 40, పచ్చిమిర్చి 40, బెండ 40, కాకర 50, దొండ 40, దోస 40, ఆలు 40, చామ 50, కీర 40, బీర 50, వంకాయ 40, గోకర 50, బీన్స్‌ 60, బీట్‌రూట్‌ 60, క్యాప్సికమ్‌ 60, క్యాబేజీ 35, క్యారెట్‌ 70, చిక్కుడు 60, ఉల్లి 60(కేజీ), ములక్కాయలు (1) 40, క్యాలీఫ్లవర్‌ (1) 40, సొరకాయ (కేజీ) 20, అల్లం 80, వెల్లుల్లి 400.

భవిష్యత్‌ తరాల కోసం విద్యా విధానంలో మార్పులు



సాంస్కృతిక కార్యక్రమాల్లో భాగంగా నృత్య ప్రదర్శన

శేరిలింగంపల్లి: 21వ శతాబ్దానికి చెందిన పిల్లల భవిష్యత్తు కోసం మన విద్యా దృక్పథాన్ని మార్చేందుకు శ్రీకారం చుట్టామని చిరెక్‌ ఇంటర్నేషనల్‌ స్కూల్‌ సీఈఓ డాక్టర్‌ పీటర్‌ మెల్‌లాఫ్లిన్‌ పేర్కొన్నారు. శేరిలింగంపల్లిలో చిరెక్‌ సరికొత్త గ్లోబల్‌ క్యాంపస్‌ను మంగళవారం రాత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యాదృక్పథాన్ని మార్చే ప్రతిష్టాత్మక ప్రాజెక్టు అయిన చిరెక్‌ 2.0ని పరిచయం చేస్తున్నామన్నారు. చిరెక్‌ 1989 నుంచి విద్యలో ఒక ఆవిష్కర్తగా ఉందని గుర్తు చేశారు. కాగ్నిటా గ్రూప్‌ ఆసియా సీఈఓ సమీర్‌ అగర్వాల్‌ మాట్లాడుతూ 2019లో చిరెక్‌, కాగ్నిటా గ్లోబల్‌ ఫ్యామిలీ ఆఫ్‌ స్కూల్‌లో చేరిందన్నారు. ప్రస్తుతం చిలీ నుంచి హాంకాంగ్‌ వరకు ప్రపంచవ్యాప్తంగా 17 దేశాలలలో 100కిపైగా ఈ పాఠశాలలు ఉన్నాయని గుర్తు చేశారు. ఈ సందర్భంగా ప్రఖ్యాత స్పీడ్‌ పెయింటర్‌ విలాస్‌ నాయక్‌, సంగీత విద్వాంసుడు బిక్రమ్‌గోష్‌ బృందం ప్రదర్శన ఆహూతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో సినీ నటుడు ప్రకాష్‌ రాజ్‌, పాఠశాల టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఐకమత్యంతో హక్కులు సాధించుకోవాలి

ఆల్విన్‌కాలనీ: అన్ని రంగాల్లోనూ అసమానతలు ఎదుర్కొంటున్న విశ్వకర్మలు జాతీయస్థాయిలో ఐకమత్యంగా హక్కులను సాధించుకోవాలని వేద పండితులు, బ్రహ్మర్షి మోహనాచార్యులు అన్నారు. మంగళవారం కూకట్‌పల్లి విశ్వకర్మ విజ్ఞాన సమితి ఆధ్వర్యంలో కూకట్‌పల్లి, జగద్గిరిగుట్టలో శ్రీమద్విరాజ్‌ పోతులూరి వీర బ్రహ్మేంద్రస్వామి ఆలయంలో కవి, గాయకుడు దరువు అంజన్న అధ్యక్షతన ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశ్వకర్మ లేనిదే విశ్వంబు లేదన్నారు. అందరూ ఏకమై హక్కులను సాధించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ హనుమంతచారి, అధ్యక్షులు శ్రీరాముల శ్రీనివాసచారి, ప్రధాన కార్యదర్శి మనోహర్‌చారి, తిరుపతిచారి, భిక్షపతిచారి, శ్రీశైలంచారి పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల బైక్‌ ర్యాలీ



బైక్‌ ర్యాలీలో పాల్గొన్న రవికుమార్‌ యాదవ్‌, నాయకులు

ఆల్విన్‌కాలనీ: బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు కాంగ్రెస్‌ ప్రభుత్వ ప్రజా వ్యతిరేక కార్యక్రమాలకు నిరసనగా ఆల్విన్‌కాలనీ, పాపిరెడ్డినగర్‌, వివేకానందనగర్‌, హైదర్‌నగర్‌ డివిజన్‌లలో పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్‌, నాయకుల ఆధ్వర్యంలో మంగళవారం బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు కాంగ్రెస్‌ పార్టీ ఇచ్చిన హామీలను, వారు చేపడుతున్న ప్రజా వ్యతిరేక కార్యక్రమాలు వివరించడానికి బైక్‌ర్యాలీ చేపట్టినట్లు తెలిపారు. అమలు కాని 6 గ్యారంటీలు, 66 మోసాలతో రాష్ట్రంలో కాంగ్రెస్‌ పార్టీ గద్దెనెక్కిందని విమర్శించారు. నేటికీ ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలుకు నోచుకోలేదన్నారు. హామీలు నెరవేర్చకుండా ప్రభుత్వం విజయోత్సవ కార్యక్రమాలు చేసుకోవడం విడ్డూరంగా ఉందన్నారు. కేసీఆర్‌కు పట్టిన గతే రేవంత్‌రెడ్డికి కూడా పడుతుందని జోస్యం చెప్పారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవీందర్‌రావు, కో కన్వీనర్‌ మణిభూషణ్‌, సీనియర్‌ నాయకులు రామరాజు, నరేందర్‌, నర్సింగ్‌ యాదవ్‌, కేశవ్‌, నరసింహాచారి, అరుణ్‌కుమార్‌, కుమార్‌యాదవ్‌, వేణుగోపాల్‌ యాదవ్‌ తదితరులు పాల్గొన్నారు.

కమీషన్‌ ఇస్తామంటూ సైబర్‌ మోసం

రూ.లక్ష డెబ్భైఐదు వేలు పోగొట్టుకున్న ప్రైవేటు ఉద్యోగి

పటాన్‌చెరు టౌన్‌: నగదు ఇన్వెస్ట్‌ చేస్తే కమీషన్‌ ఇస్తామంటూ ఆశ చూపి ఓ ప్రైవేటు ఉద్యోగి నుండి రూ.1,75,000 లక్షలు కాజేసిన సంఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పటాన్‌చెరు డివిజన్‌కు చెందిన ఓ ప్రైవేటు ఉద్యోగికి జూలై 15వ తేదీన నగదు ఇన్వెస్ట్‌ చేస్తే కమీషన్‌ ఇస్తామంటూ వచ్చిన కాల్‌కు స్పందించి, పలు దఫాలుగా రూ. ఒక లక్ష డెబ్బైఐదు వేలు వేశాడు. ఇంకా నగదు వెయ్యాలని అడగడంతో అనుమానం వచ్చిన అతను తాను పెట్టిన నగదుతో పాటు కమీషన్‌ ఇవ్వాలని అడగడంతో స్పందించలేదు. దీంతో బాధితుడు తాను మోసపోయినట్లు గుర్తించి, ముందుగా సైబర్‌ క్రైమ్‌ పోలీసులకు ఫిర్యాదు చేసి, అనంతరం పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఇంద్రేశంలో చైన్‌స్నాచింగ్‌

పటాన్‌చెరు టౌన్‌: స్కూల్‌ నుంచి కుమారుడిని తీసుకొని వస్తున్న మహిళ మెడలోని గొలుసును లాక్కెళ్లిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం... పటాన్‌చెరు మండలం ఇంద్రేశం ఎన్‌ఆర్‌ఐ కాలనీకి చెందిన గొల్ల భాగ్యమ్మ మంగళవారం మధ్యాహ్నం స్కూల్‌కి వెళ్లి కుమారుడు నవనీత్‌ (4)ని తీసుకొని ఇంటికి వెళ్తుండగా, మార్గమధ్యంలో హెల్మెట్‌ ధరించిన వ్యక్తి మెడలో ఉన్న పుస్తెలతాడును లాగడంతో భాగ్యమ్మ కింద పడిపోయింది. చైన్‌ తీసుకుని కొద్ది దూరంలో నిలిపిన బైక్‌ను తీసుకొని పరారయ్యాడు. దీంతో బాధితురాలు భాగ్యమ్మ మంగళవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఏడుగురికి జరిమానా

పటాన్‌చెరు టౌన్‌: డ్రంకెన్‌ డ్రైవ్‌లో పట్టుబడ్డ వాహనదారులకు సంగారెడ్డి జిల్లా కోర్టు జరిమానా, జైలు విధించిన సంఘటన పటాన్‌చెరు ట్రాఫిక్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. ట్రాఫిక్‌ సీఐ లాలూనాయక్‌ తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం నిర్వహించిన డ్రంకెన్‌ డ్రైవ్‌లో ఏడుగురుని పట్టుకున్నట్లు చెప్పారు. పట్టుబడిన వాహన దారులను మంగళవారం సంగారెడ్డి కోర్టులో హాజరు పర్చగా ఒక్కొక్కరికి రూ. 2 వేలు జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ పోలీసులు పేర్కొన్నారు.

దివ్యాంగుల సంక్షేమానికి పెద్దపీట



మహిళలకు చెక్కు అందజేస్తున్న ఎమ్మెల్యే గాంధీ, ఎంబీసీ చైర్మన్‌ జైపాల్‌ తదితరులు

చందానగర్‌: దివ్యాంగుల సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని ఎమ్మెల్యే గాంధీ అన్నారు. ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం, ప్రజా పాలన విజయోత్సవాలలో భాగంగా చందానగర్‌ పీజేఆర్‌ స్టేడియంలో మంగళవారం దివ్యాంగులకు ట్రైసైకిల్స్‌ అందజేశారు. చందానగర్‌, శేరిలింగంపల్లి ఉపకమిషనర్లు మోహన్‌రెడ్డి, ముకుంద్‌రెడ్డి, ఎంబీసీ చైర్మన్‌ జేరిపేటి జైపాల్‌, కాంగ్రెస్‌ పార్టీ నియోజకవర్గం ఇంచార్జి జగదీశ్వర్‌గౌడ్‌, కార్పొరేటర్లు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ జీహెచ్‌ఎంసీ, అలింకో ఇండియా సంస్థ సమన్వయంతో శేరిలింగంపల్లి సర్కిల్‌ పరిధిలో.. 128 మంది, చందానగర్‌లో 143 మొత్తం 271 మంది వికలాంగులకు వీల్‌చైర్స్‌, ట్రై సైకిల్స్‌, వినికిడి యంత్రాలు, బ్లైండ్‌ స్టిక్స్‌ అందజేశామన్నారు. త్వరలోనే దివ్యాంగులకు రూ.6వేల ఆసరా పెన్షన్‌ అందిస్తామన్నారు. అనంతరం స్వయం సహాయక సంఘాలకు బ్యాంకు రుణాలు చెక్కు అందజేశారు. ఉచిత వైద్య శిబిరం, బతుకమ్మ, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మంజుల రఘునాథ్‌రెడ్డి, నాగేందర్‌ యాదవ్‌, ఉప్పలపాటి శ్రీకాంత్‌, పూజిత జగదీశ్వర్‌ గౌడ్‌, జీహెచ్‌ఎంసీ సర్కిల్‌ 21 ఈఈ రాజు, ఏఎంహెచ్‌ఓ డాక్టర్‌ రవికుమార్‌, డీఈలు, ఏఈలు, ప్రాజెక్టు అధికారి ఉషారాణి, నాగమల్లీశ్వరి, వివిధ విభాగాల అధికారులు, దివ్యాంగులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు: పటాన్‌చెరు సర్కిల్‌ పరిధిలోని 3 డివిజన్‌లకు సంబంధించి 225 మంది దివ్యాంగులకు 17,97,000 లక్షల తొంభైఏడు వేల రూపాయలతో కొనుగోలు చేసిన వినికిడి యంత్రాలు, వీల్‌చైర్లు, చేతికర్రలు, ట్రైసైకిళ్లను స్థానిక ప్రజా ప్రతినిధులతో కలిసి ఎమ్మెల్యే మహిపాల్‌ రెడ్డి అందజేశారు. పటాన్‌చెరు డివిజన్‌ పరిధిలోని జీహెచ్‌ఎంసీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ.. దివ్యాంగులు ఆత్మవిశ్వాసానికి ప్రతీక అని అన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు మెట్టుకుమార్‌ యాదవ్‌, సింధు ఆదర్శ్‌రెడ్డి, పుష్ప నగేష్‌, జీహెచ్‌ఎంసీ డిప్యూటీ కమిషనర్‌ సురేష్‌, సీఐ వినాయక్‌ రెడ్డి, అఫ్జల్‌ తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగులకు వీల్‌చైర్లు అందజేస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

సీసీ రోడ్డు పనుల పరిశీలన



ప్రేమ్‌నగర్‌ ఏ బ్లాక్‌లో సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌

చందానగర్‌: కొండాపూర్‌ డివిజన్‌ పరిధిలోని ప్రేమ్‌నగర్‌ ఏ బ్లాక్‌లో చేపట్టిన సీసీ రోడ్ల పనులను కార్పొరేటర్‌ హమీద్‌ పటేల్‌ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.32 లక్షల అంచనా వ్యయంతో చేపట్టిన రోడ్డు పనుల్లో నాణ్యత పాటించాలన్నారు. ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులు పూర్తి చేయాలని కాంట్రాక్టర్‌కు ఆదేశించారు. ఈ పరిశీలనలో నాయకులు రూపారెడ్డి, షేక్‌ ఇమామ్‌, సయ్యద్‌ అమీనుద్దిన్‌, సయ్యద్‌ ఉస్మాన్‌, కొడిచర్ల రవి, ఖదీర్‌, సంతోష్‌, నరేష్‌, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

ప్రజాపాలనపై కళాయాత్ర



పథకాలపై అవగాహన కల్పిస్తున్న కళాకారులు

కూకట్‌పల్లి: ప్రజా పాలన విజయోత్సవాల్లో భాగంగా మేడ్చల్‌– మల్కాజ్‌గిరి జిల్లా తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు 2 బృందాలుగా ఏర్పడి ప్రజా పాలన కళాయాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా మంగళవారం కూకట్‌పల్లి మండలం శంషీగూడ, మూసాపేట్‌, అల్లాపూర్‌ జీహెచ్‌ఎంసీ పరిసర ప్రాంతాల్లో ప్రజాపాలన కళాయాత్ర నిర్వహించారు. కళాకారులు ప్రభుత్వ సంక్షేమ పథకాలపై పాటలతో, డప్పు చప్పుళ్లతో ప్రచారం చేశారు.

కాలనీల్లో కార్పొరేటర్‌ రాగం పర్యటన



డీసీ ముకుంద్‌రెడ్డితో మాట్లాడుతున్న కార్పొరేటర్‌ నాగేందర్‌యాదవ్‌ తదితరులు

శేరిలింగంపల్లి: సురభి కాలనీ–రాజీవ్‌ గృహకల్ప వద్ద వరద నీటి సమస్య పరిష్కారానికి వెంటనే ప్రణాళికలు చేపట్టాలని శేరిలింగంపల్లి కార్పొరేటర్‌ రాగం నాగేందర్‌ యాదవ్‌ సూచించారు. డివిజన్‌ పరిధిలోని సురభి కాలనీ, రాజీవ్‌ గృహకల్ప తదితర ప్రాంతాల్లో డిప్యూటీ కమిషనర్‌ ముకుంద్‌రెడ్డితో కలిసి మంగళవారం పాదయాత్ర చేశారు. స్థానికులు పలు సమస్యలను కార్పొరేటర్‌ దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా నాగేందర్‌ యాదవ్‌ మాట్లాడుతూ వరద సమస్య, మంచినీటి సరఫరా లో ప్రెషర్‌, సీవరేజ్‌ ఓవర్‌ ఫ్లోతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని వాటర్‌ వర్క్స్‌ అండ్‌ సీవరేజ్‌ బోర్డు అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డీఈ ఆనంద్‌, ఏఈ భాస్కర్‌, ఏఎంసీ ప్రేమ్‌కుమార్‌, వాటర్‌వర్క్స్‌ మేనేజర్‌ అభిషేక్‌రెడ్డి, ఎలక్ట్రికల్‌ సెక్షన్‌ సబ్‌ ఇంజనీర్‌ వరుణ్‌, వార్డు మెంబర్‌ శ్రీకళ, నాయకులు కొయ్యాడ లక్ష్మణ్‌ యాదవ్‌, సురభి కాలనీ అసోసియేషన్‌ అధ్యక్షులు చంద్రశేఖర్‌, వెంకట్‌రెడ్డి, సందయ్యనగర్‌ అధ్యక్షులు బసవరాజు, గోపీనగర్‌ బస్తీ అధ్యక్షులు గోపాల్‌యాదవ్‌ పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలకు ఆర్‌ఓ ప్లాంట్‌ వితరణ



ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ కార్పొరేటర్‌ సాయిబాబా, క్లబ్‌ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి

రాయదుర్గం: ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు రోటరీ క్లబ్‌ సేవలు అమోఘమని గచ్చిబౌలి డివిజన్‌ మాజీ కార్పొరేటర్‌ కొమిరిశెట్టి సాయిబాబా పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్‌ కేశవనగర్‌లో మండల పరిషత్‌ ప్రాథమిక పాఠశాలలో జూబ్లీహిల్స్‌ రోటరీక్లబ్‌ వారి ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆర్‌ఓ ప్లాంట్‌ను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వచ్ఛంద సంస్థలు, వ్యక్తులు ముందుకొస్తే పేద, మధ్యతరగతి విద్యార్థులు చదువుకొనే ప్రభుత్వ పాఠశాలల రూపురేఖలు మారుతాయన్నారు. రోటరీక్లబ్‌ జూబ్లీహిల్స్‌ అధ్యక్షుడు బాలకోటిరెడ్డి మాట్లాడుతూ విద్యార్థులకు మంచినీరు అందించేందుకు ఆర్‌ఓ ప్లాంట్‌ను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. అనంతరం వారు పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు,ఉపాధ్యాయులు, రోటరీ క్లబ్‌ సభ్యులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాల్లో సౌకర్యాలు కల్పించాలి

- కనీసం మందులు కూడా అందుబాటులో లేవు
- ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజల పక్షాన నిలదీస్తాం
- ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

మోతీనగర్‌: పేద ప్రజల ఆరోగ్యం బాగుండాలనే ఉద్దేశంతోనే రాష్ట్రంలో బస్తీ దవాఖానాలను గత ప్రభుత్వం ఏర్పాటు చేస్తే, ఈ ప్రభుత్వంలో కనీస వసతులు లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. మంగళవారం మూసాపేట్‌, అల్లాపూర్‌ డివిజన్‌లలోని బస్తీ దవాఖానాలను పరిశీలించారు. రోగులతో మాట్లాడి దవాఖానాలో అందుతున్న సేవల గురించి ఆరా తీశారు. నెలవారీగా ఆసుపత్రికి వస్తున్న వారి సంఖ్యను వైద్యుల ద్వారా తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. పాలకుల అలసత్వంతో బస్తీ దవాఖానాలు సుస్తీపడే విధంగా ఉన్నాయన్నారు. దవాఖానాలో కనీసం బీపీ, షుగర్‌ మందులు కూడా లేవని, టెస్టులకు పరికరాలు లేకుండా దయనీయమైన స్థితిలో దవాఖానాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. నేడు ఏం సాధించారని వేడుకలు చేసుకుంటున్నారని ఆయన ప్రశ్నించారు. బస్తీ దవాఖానాలకు వచ్చే వారి సంఖ్య తగ్గడానికి కారణం.. ప్రభుత్వ నిర్లక్ష్యమేనని ఆగ్రహం వ్యక్తం చేశారు.

హెచ్‌సీయూ డిపోలో వన భోజనాలు



రాయదుర్గం: ఆర్టీసీ సంస్థ ఆధ్వర్యంలో గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ డిపోలో మంగళవారం కార్తీక వన భోజనాలను నిర్వహించారు. రీజనల్‌ మేనేజర్‌ ఎం రాజశేఖర్‌, డిప్యూటీ ఆర్‌ఎం(ఎం)సురేష్‌చౌహాన్‌తో కలిసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా రాజశేఖర్‌ మాట్లాడుతూ అందరూ కలిసి కట్టుగా సమన్వయంతో పనిచేసేలా చేయడమే లక్ష్యంగా సాగుతున్న ఈ కార్యక్రమం చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజర్‌ ఎం మురళీధర్‌రెడ్డి, అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

స్వల్పకాలిక కోర్సులకు ప్రతిపాదనలు

రాష్ట్ర ప్రభుత్వం, సాంకేతిక విద్యాశాఖ ఆమోదం రాగానే అమలు

- ఏడాదిలో అందుబాటులోకి స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ భవనం
- జీఐఎల్‌టీ రాయదుర్గం ప్రిన్సిపల్‌ షేక్‌ ఎక్బాల్‌ హుస్సేన్‌



రాయదుర్గం: గవర్నమెంట్‌ ఇన్‌స్టిట్యూట్‌ ఆఫ్‌ లెదర్‌ టెక్నాలజీ రాయదుర్గం (జీఐఎల్‌టీ)లో స్వల్పకాలిక కోర్సుల కోసం ప్రతిపాదనలు చేయనున్నట్టు ప్రిన్సిపల్‌ షేక్‌ ఎక్బాల్‌ హుస్సేన్‌ తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఇప్పటి వరకు 120 సీట్లకు 100 మంది అడ్మిషన్లు పొందారని వెల్లడించారు. మంగళవారం ఆయన 'సాక్షి'కి పలు అంశాలను వివరించారు. ప్రభుత్వం, రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖకు సల్పకాలిక కోర్సుల ప్రతిపాదనలు పంపిన తర్వాత ఆమోదం లభిస్తే వెంటనే అందుబాటులోకి తీసుకొస్తామని వివరించారు.

ప్రశ్న: స్వల్పకాలిక కోర్సుల గురించి ?

ప్రిన్సిపల్‌: జీఐఎల్‌టీలో ప్రస్తుతం లెదర్‌ గూడ్స్‌ అండ్‌ ఫుట్‌వేర్‌, లెదర్‌గూడ్స్‌ అండ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ కోర్సులున్నాయి. 3 నుంచి 6 నెలల స్వల్పకాలిక కోర్సులను అందుబాటులోకి తేవాలని స్టడీ చేస్తున్నాం. ముఖ్యంగా ఫుట్‌వేర్‌ డిజైనింగ్‌, లెదర్‌ గూడ్స్‌ డిజైనింగ్‌, లెదర్‌ ఫినిషింగ్‌, ఫుట్‌వేర్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ, శాండిల్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ వంటి కోర్సులను అందుబాటులోకి తేవాలని ప్రయత్నం.

ప్ర: స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ ఎప్పుడు అందుబాటులోకి వస్తుంది

జ: జీఐఎల్‌టీ క్యాంపస్‌లోనే స్కిల్‌ డెవలప్‌మెంట్‌ సెంటర్‌ను వచ్చే ఏడాదిలోపు అందుబాటులోకి తేవాలని నిర్ణయించాం. రూ.48 లక్షల వ్యయంతో ఈ భవన నిర్మాణం సాగుతోంది. యువత స్వల్పకాలిక కోర్సులను పూర్తి చేసి ఉపాధి పొందేలా చేస్తుందని భావిస్తున్నాం.

ప్ర: ఈ ఏడాది వందశాతం సీట్లు భర్తీ అయ్యాయా..?

జ: జీఐఎల్‌టీలో రెండు కోర్సులు ఉన్నాయి. అందులో ఒక్కోదాంట్లో 60 సీట్ల చొప్పున మొత్తం 120 మందికి అవకాశం కల్పిస్తాం. ప్రస్తుత సంవత్సరం లెదర్‌గూడ్స్‌ అండ్‌ ఫుట్‌వేర్‌ కోర్సులో 60 సీట్లు భర్తీ అయ్యాయి. లెదర్‌ అండ్‌ ఫ్యాషన్‌ టెక్నాలజీ కోర్సులో 60కి 40 మంది చేరారు. వచ్చే ఏడాది 100 శాతం సీట్లు భర్తీ అయ్యేలా హైస్కూల్‌ విద్యార్థులకు అవగాహన కార్యక్రమాలు, ఇన్‌స్టిట్యూట్‌లో పాలిసెట్‌ ప్రవేశ పరీక్షపై ప్రత్యేక శిక్షణా కార్యక్రమాన్ని ఏర్పాటు చేస్తాం.



రాయదుర్గంలోని జీఐఎల్‌టీ ప్రధాన భవనం

ప్ర: క్యాంపస్‌లో కల్పించే సౌకర్యాలు..?

జ: జీఐఎల్‌టీ క్యాంపస్‌ ఆధునికీకరణకు అన్ని చర్యలు చేపట్టాం. సాంకేతిక విద్యాబోధన, ప్రాక్టికల్స్‌, కంప్యూటర్‌ ల్యాబ్‌, ఇతర అధునాతన పరికరాలు అందుబాటులో ఉన్నాయి. రూ.3 కోట్లతో ఇటీవలే క్యాంపస్‌లో వసతిగృహం భవనం అందుబాటులోకి రావడంతో 100 మంది విద్యార్థులకు అవకాశం కల్పించాం.